www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 3 జనవరి 2026

5

కాకినాడ



టోల్‌ప్లాజాల వద్ద ఫ్రీ వే ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

టోల్‌ప్లాజాల దగ్గర ఫ్రీ వే ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి శుక్రవారం ట్విట్టర్ ద్వారా పోస్ట్ చేశారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని నాలుగు రోజులు పాటు హైదరాబాద్ జాతీయ రహదారి హైవేపై ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలనేది కేంద్రమంత్రినితిన్ గడ్కరీని కోరినట్టు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. టోల్‌ప్లాజాల దగ్గర ఫ్రీ వే ఉంటే వాహనాల రద్దీని నివారించవచ్చునని తెలిపారు. ప్రజా ప్రయోజనాన్ని ప్రథమంగా పరిగణలోకి తీసుకుని ఇలాంటి నిర్ణయాలు, దేశవ్యాప్తంగా రవాణా వ్యవస్థను సమర్ధంగా నిర్వహించడంలో కూటమి ప్రభుత్వం బాధ్యతాయుతంగా ఉందన్నారు.

బడుల్లో తాగునీటికి కటకట

- మరమ్మతుల్లో ఆర్‌ఒ ప్లాంట్లు
- నిర్వహణ మరచిన వైనం
- ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పిఠాపురం పాత బస్టాండ్ మున్సిపల్ హైస్కూల్లో 360 మంది విద్యార్థులు చదువుతుండగా నాడు-నేడు పథకంలో భాగంగా ఒక ఆర్‌ఒ ప్లాంటు ఏర్పాటు చేశారు. కొన్ని నెలలుగా అది మరమ్మతులకు గురవడంతో స్థానిక ఉపాధ్యాయులు మున్సిపల్ వాటర్ ట్యాప్ నీటిని విద్యార్థులకు అందజేస్తున్నారు. అనేకమంది పిల్లలు ఇళ్ల వద్ద నుంచి తాగునీటిని తీసుకొచ్చుకుంటున్నారు. ఇలా పలు ప్రభుత్వ పాఠశాలల్లో తరచూ ఆర్‌ఒ వాటర్ ప్లాంట్స్ మరమ్మతులకు గురవుతున్నాయి. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఇతర ఉపాధ్యాయులు సొంత సొమ్ములు వెచ్చించి వాటిని రిపేర్లు చేయించాల్సి వస్తుంది. ఇలా పలు ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. కాకినాడ జిల్లాలో 1,253 పాఠశాలల్లో 1,33,258 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ప్రైమరీ విద్యార్థులు 36,832 మంది, యుపి విద్యార్థులు 9,552, హైస్కూలు విద్యార్థులు 86,874 మంది ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చింది. దానిలో భాగంగానే సురక్షిత తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో విద్యార్థుల కోసం ఆర్‌ఒ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అవి నాటి ప్రభుత్వ హయాంలోనే అనేక ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయి. ప్రభుత్వం వాటిని ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది తప్ప వాటి నిర్వహణను మాత్రం ప్రత్యేకంగా నిధులను కేటాయించకపోవడంతో అనేక చోట్ల నిరుపయోగంగా మారాయి.


పిఠాపురం పట్టణంలోని ఒబిఎస్ స్కూల్లో పని చేయని ఆర్‌ఒ ప్లాంట్

విద్యారంగంపై నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంపై పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందనే విమర్శలు తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. గత సర్కారు అమ్మఒడి, విద్యాకానుక, నాడు-నేడు, విద్యా దీవెన వంటి పథకాల ద్వారా విద్యాభివృద్ధికి కొంతైనా కృషి జరిపేది. పాఠశాలల విలీనం పేరుతో విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందని విమర్శలను ఎదుర్కొంది. కూటమి విద్యారంగాన్ని మరింత దిగజారుస్తోందని ఆరోపణలు ఇప్పుడు ఎక్కువగా ఉన్నాయి. కేవలం తల్లికి వందనం పథకాన్ని మాత్రమే అమలు చేస్తోంది. నాడు-నేడు కార్యక్రమాన్ని పూర్తిగా పక్కన పెట్టింది. దానిలో భాగంగా పాఠశాలల అభివృద్ధి కుంటుపడింది.

మూలకు చేరిన ఆర్‌ఒ ప్లాంట్లు

జిల్లావ్యాప్తంగా అనేక పాఠశాలల్లో కనీసం తాగునీరు కూడా దొరకని పరిస్థితులు నెలకొన్నాయి.పలు చోట్ల విద్యార్థులే ఇళ్ల నుంచి బాటిళ్ల ద్వారా నీరు తెచ్చుకుంటున్నారు. కొందరు ఉపాధ్యాయులు తమ సొంత ఖర్చులతో నీటిని సమకూర్చుతున్న పరిస్థితులు మరికొన్ని ప్రాంతాల్లో ఉన్నాయి. రూ. లక్షల ఖర్చు చేసి ఏర్పాటు చేసినా అవి అక్కరకు రాకుండా పోతున్నాయి. అనేక చోట్ల మరమ్మతులకు గురవుతున్నాయి. వాటిని బాగు చేయించడానికి కొన్ని పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు సొంత సొమ్ములు ఖర్చు చేస్తున్నారు. కొన్ని పాఠశాలలు హెచ్‌ఎంలు కనీసం పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. దీంతో పిల్లలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందని పరిస్థితులు నెలకొన్నాయి. కాకినాడ రూరల్ కొవ్వూరు ఎంపిపిఎస్ స్కూల్లో కొంతకాలంగా ఆర్‌ఒ ప్లాంట్ పని చేయడం లేదు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో మూడేళ్ల నుంచి, పెదపూడి మండలం ఆర్‌ఆర్.పేట, పైన, కుమార ప్రియం, పెద్దాడ తదితర పాఠశాలల్లో రెండేళ్ల నుంచి, గొల్లప్రోలు మండలం దుర్గాడ హైస్కూల్లో ఏడాదిన్నర నుంచి, కాజులూరు మండలం కుయ్యేరు పాఠశాలలో మూడేళ్ల నుంచి, రౌతులపూడి మండలం ఎ.మల్లవరం, శృంగవరం, ములగపూడి, గుమ్మరేగుల, ఆర్‌కె.పురం, గిడజాం, ఎస్.పైడిపాల, ఎస్.అగ్రహారం, రౌతులపూడి, బలరామపురం, పి.చామవరం, తొండంగి మండలం పైడికొండ, కోదాడ, కొత్త కోదాడ, వాకదారిపేట, బెండపూడి, గోపాలపట్నం, ఎర్రయ్యపేట పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు నెలలు తరబడి మరమ్మతులకు గురయ్యాయి. మరమ్మతులు చేయడానికి సంబంధిత సాంకేతిక నిపుణుడు చాలా సమయం తీసుకుంటున్నారు. ఇలా పలు ప్రాంతాల్లో తాగునీటి కోసం విద్యార్థులు అనేక అవస్థలు పడాల్సి వస్తోంది.


ఇళ్ల వద్ద నుంచి తాగునీటిని తెచ్చుకున్న విద్యార్థులు

సురక్షిత తాగునీరు కరువు

సురక్షితమైన తాగునీరు సౌకర్యం లేని అనేక పాఠశాలల్లో అందుబాటులో ఉన్న నీటిరే తాగుతూ విద్యార్థులు రోగాల పాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు తాగునీటిని అందించడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్వో ప్లాంట్లు తరచూ రిపేర్లు వచ్చి మూలకు చేరుతున్నా పర్యవేక్షణ చేయడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

సోషలిస్టు భావనతో సన్మార్గంలో యువత

ప్రజాశక్తి-కాకినాడ

సోషలిస్టు భావనతోనే యువత సన్మార్గంలో నడవడం సాధ్యపడుతుందని అధ్యాపకులు పెద్దింశెట్టి లెనిన్ బాబు అన్నారు. ఇంద్రపాలెం కెఎస్ రోడ్డులో శుక్రవారం నిర్వహించిన కుడిపూడి సూర్యనారాయణ 22వ వర్ధంతి సభలో ఆయన 'తొలితరం కమ్యూనిస్టుల ఆశయాలు- వర్తమాన పరిస్థితులు - నేటితరం కర్తవ్యం' అనే అంశంపై మాట్లాడారు. తొలితరం కమ్యూనిస్టుల పని చేసిన నాటి పరిస్థితిలు నేడు లేవని, నాటి తరం కమ్యూనిస్టుల స్ఫూర్తితో నేటి పరిస్థితితులకు అనుగుణంగా నేటి తరం పనిచేస్తూ ప్రజా విశ్వాసం పొందాలన్నారు. తొలితరం కమ్యూనిస్టులు మార్క్సిజం కాగడా చెబూని సోషలిస్టు సమాజ స్థాపనకు జీవితాలను పణంగా పెట్టి త్యాగాలు చేశారని కొనియాడారు. వారి త్యాగాలు ఫలితమే అశేష ప్రజానీకం అనేక ప్రయోజనాలూ పొందిందన్నారు. తద్వారా కమ్యూనిస్టు పార్టీ ఒక అజేయమైన రాజకీయ శక్తిగా ఎదిగిందని చెప్పారు. తాత్కాలికంగా ఎదురైన ప్రతికూల పరిస్థితి, దానికి కారణమైన పరిణామాల్ని గతితార్కిక దృక్కోణంలో అంచనా వేసి నిత్యం ప్రజల చెంతన ఉండగలిగితే తిరిగి ప్రజా విశ్వాసం పొందడం ఖాయమని విశ్లేషించారు. నాడు శత్రువు ప్రత్యక్షంగా కళ్ళ ముందు కనిపిస్తూ దోపిడీ చేస్తే, నేడు శత్రువు ఎవరో యజమాని ఎవడో తెలియని కాలంలో దోపిడి తీవ్రంగా జరుగుతుందని వివరించారు. పర్యావరణాన్ని నాశనం చేస్తూ ప్రకృతి వనరులను సైతం కాజేసేటంత స్థాయిలో దోపిడి పెరిగి ఆర్థిక అసమానతలు బాగా పెరిగిపోయాయని, దోపిడి కుట్రలు పట్టించుకునే స్థితి లేకుండా, ప్రజలను కులం మతం రాజకీయాలతో ముడిపెట్టి ప్రక్కదారి పట్టించి సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యంగా విద్యార్థి,యువతరం మార్క్సిజాన్ని అర్థం చేసుకోవడం ద్వారా సత్ప్రవర్తనతో మెలుగుతూ సమాజాన్ని ముందుకు నడిపే స్థాయికి ఎదగాలని కోరారు. అదే కుడిపూడి సూర్యనారాయణకు నిజమైన నివాళన్నారు. సిపిఎం నాయకులు విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో పార్టీ రూరల్ మండల కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్, చంద్రరావు, నాయకులు పెద్దింశెట్టి రామకృష్ణ, టి.రాజా, అజయ్ కుమార్, నాగదేవి, పద్మ, సాహిత్, వాసుదేవ్, రోహిత్, రవితేజ, గుత్తుల రామకృష్ణ, సామాజిక కార్యకర్త గౌరవ్, కెఎస్ కుమార్తెలు రాజ్యలక్ష్మి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న పెద్దింశెట్టి లెనిన్‌బాబు

కాకినాడ నగర సుందరీకరణకు చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ నగరంలోని జగన్నాథపురం, కోటిపల్లి బస్టాండ్ వైపు ఉన్న ప్రజా టాయిలెట్లను త్వరలో వినియోగంలోకి తీసుకురావాలని నగర పాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎన్‌వివి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన జగన్నాథపురంలో రెండు వంతెనల మధ్య ఉన్న ఖాళీ ప్రాంతాన్ని పరిశీలించారు. పరిశుభ్రత నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ ప్రాంతం అపరిశుభ్రంగా ఉండటం, తుప్పలు పెరిగిపోవడంతో నగర సుందరీకరణలో భాగంగా శుభ్రపరిచే పనులను ప్రారంభించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా 30వ డివిజన్ సచివాలయం 'బి' ప్రాంగణంలోని టాయిలెట్లు, జగన్నాథపురం, కోటిపల్లి బస్టాండ్ వద్ద ఉన్న టాయిలెట్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కమిషనర్ ఎన్‌వివి. సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, ఇఇ కనకరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు ధర్మాజీ, సత్తిబాబు పాల్గొన్నారు.


వంతెన వద్ద కాల్వను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కమిషనర్


సఫ్దర్ హాష్మీకి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజా కళాకారులకు హాష్మీ జీవితం ఆదర్శం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజా కళాకారులు సఫ్దర్ హాష్మీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలని ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి రొంగల వీర్రాజు అన్నారు. శుక్రవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహించిన హాష్మి వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ప్రజా జీవితంలోని అన్ని అంశాలనూ ఆయన ఇతివృత్తాలుగా మలిచి కళారూపాలుగా జనం ముందు ఆవిష్కరించారన్నారు. ఈ కళారూపాలు జనంలో తీసుకొస్తున్న చైతన్యాన్ని చూసి పెట్టుబడిదారీ వర్గాలు ఆయనను హత్య చేసినా దేశవ్యాప్తంగా వేలాది మంది కళాకారులు ఆయన బాటలో కళారూపాలు ప్రదర్శించారన్నారు. సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం మాట్లాడుతూ కళాకారులందరూ ఆయన బాటలో పయనించి కళారూపాల ద్వారా ప్రజా చైతన్యానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కళాకారులు నీలం శ్రీను, చింతల సత్యనారాయణ, తాడిశెట్టి గంగ, వివేక్, ధరణి, నెక్కల నరసింహమూర్తి, కూనిరెడ్డి అప్పన్న, సిరపరపు శ్రీనివాస్, కూనిరెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో సైన్స్ కీలకం

ప్రజాశక్తి - పెద్దాపురం

సమాజ అభివృద్ధిలో సైన్స్ కీలకమని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అన్నారు. పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ రంగోలి పోటీల విజేతలకు శుక్రవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ సభలో ఆయన మాట్లాడారు. చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్షుడు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ మానవ మేధస్సు నిరంతరం సైన్స్ రోభివృద్ధికి పాటు పడుతోందన్నారు. సైన్సు, సైన్స్ ద్వారా సాంకేతిక అభివృద్ధితో ప్రపంచం నిరంతరాయంగా అభివృద్ధి చెందుతుందన్నారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి రవివర్మ మాట్లాడుతూ చిన్ననాటి నుంచి బాలల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించాలన్నారు. యుటిఎఫ్ పెద్దాపురం పట్టణ కార్యదర్శి కె.వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలన్నారు. ఈ పోటీలకు జడ్జిలుగా స్వర్ణకుమార్, పావని వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పిసిసి గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్, సుధీర్ కుమార్, పెదిరెడ్డి నరేష్, దేవత రాజేష్ కుమార్, డి.గంగాధరుడు, నెక్కల అనూష, ఊటా అంజలి, జస్వితా, సాయి, బంగారం, పవన్, లలిత, లావణ్య, మంజుల, మణి, సందీప్, హర్ష పాల్గొన్నారు.


సైన్స్ రంగోలి పోటీల విజేతలతో క్లబ్ నిర్వాహకులు


నచికేత విద్యార్థులతో ఎస్‌పి బిందుమాధవ్

విద్యతోనే జీవితానికి పునాది

ప్రజాశక్తి-కాకినాడ

విద్యతోనే జీవితానికి పునాది ఏర్పడుతుందని జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ అన్నారు. సేవాభారతి ఆధ్వర్యంలో కాకినాడ నగరంలో నిర్వహిస్తున్న 'నచికేత విద్యార్థుల ఆవాసం'లో విద్యార్థులకు ప్రోత్సాహకరమైన కార్యక్రమం నిర్వహించారు. నచికేత విద్యార్థులు ఎస్‌పిని ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఈ హాస్టల్‌లో ప్రస్తుతం మొత్తం 28 మంది విద్యార్థులు నివసిస్తూ విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. 1వ తరగతి నుంచి పాలిటెక్నిక్ వరకూ చదువుతున్న విద్యార్థులు ఈ ఆవాసంలో ఉన్నారని తెలిపారు. విద్యే జీవితానికి పునాది అని, క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని సూచించారు. అనంతరం ఎస్‌పి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను అందజేశారు.

ఆదిత్యలో ప్రి ఇన్‌క్యుబేషన్ ప్రోగ్రామ్ ప్రారంభం

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్, ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆరంభ్ ప్రి ఇన్‌క్యుబేషన్ ప్రోగ్రామ్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైనట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం జనవరి 2 నుంచి 10 వరకు ఎనిమిది రోజుల పాటు జరగనుందన్నారు. విద్యార్థి ఆవిష్కర్తలను రిఫైన్ చేయడం, వాలిడేట్ చేయడం, బిల్డింగ్ చేయడం ద్వారా వారి వర్కింగ్ ప్రోటోటైప్‌లను మెరుగు పరచడానికి రూపొందించిన ఈ ప్రోగ్రామ్ నిపుణుల మెంటరింగ్, హ్యాండ్స్-ఆన్ మార్గదర్శకత్వం అందిస్తుందన్నారు. ఆలోచనలను వాలిడేట్ చేయడం, బిజినెస్ మోడల్స్‌ను బలోపేతం చేయడం, ఆవిష్కరణలను ఇన్‌క్యుబేషన్ రెడీ స్టార్టప్‌లుగా మార్చడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిఐఐ చైర్‌ఉమెన్ చాందినీ చందన, హెడ్ ఆఫ్ మార్కెటింగ్ నల్లమిల్లి శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ ప్రోగ్రామ్‌లో 20కు పైగా బృందాలు పాల్గొంటున్నాయి. 15కు పైగా సెషన్స్, 10కు పైగా స్పీకర్ల ద్వారా విద్యార్థులకు వర్క్‌స్పేస్, మెంటరింగ్, టెక్నికల్ సపోర్ట్, ప్రోటోటైపింగ్, ఐపిఆర్ అవగాహన, ఇన్‌క్యుబేషన్ పాత్‌వే వంటి ప్రయోజనాలు అందిస్తారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో వ్యవస్థాపకత ఆలోచనను పెంపొందించి, వారి ఆవిష్కరణలను వాస్తవిక స్టార్టప్‌లుగా మార్చేందుకు దోహదపడుతుందని తెలిపారు. డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఆరంభ్ ప్రోగ్రామ్ విద్యార్థులకు తమ ఆలోచనలను ప్రోటోటైప్‌లుగా మార్చి, ఇన్‌క్యుబేషన్ రెడీ స్టార్టప్‌లుగా అభివృద్ధి చేసే అద్భుతమైన వేదిక అన్నారు. ఇడిసి, ఐఐసి మద్దతుతో తమ విద్యార్థులు ఆవిష్కరణల రంగంలో మరిన్ని మైలురాళ్లు సాధిస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, ప్రో వైస్ ఛాన్సలర్ల డాక్టర్ రమేష్ ఆదిరెడ్డి, డాక్టర్ రవి తంగజన్, డీన్ డాక్టర్ సంజీవ్ రావు, అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేష్, కో ఆర్డినేటర్ చరణ్ సంజీవ్, కల్యాణ్ చక్రవర్తి ఫ్యాకల్టీ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రోగ్రామ్‌లో పాల్గొన్న ఆదిత్య సిబ్బంది, విద్యార్థులు

టైక్వాండోలో ఆదిత్య విద్యార్థికి మెడల్

ప్రజాశక్తి-కాకినాడ

ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో బిఎఫ్ఎస్ఐ ప్రథమ సంవత్సరం విద్యార్థిని గొర్లె నాగ తనుశ్రీ జాతీయ టైక్వాండో పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించినట్లు కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. 40వ జాతీయ టైక్వాండో ఐటిఎఫ్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు గుజరాత్‌లోని గాంధీ నగర్‌లో డిసెంబర్ 28 నుంచి 30 వరకూ నిర్వహించారు. 60 కేజీల పైన కేటగిరిలో ఎపి టీమ్ తరఫున ఆడిన నాగ తనుశ్రీ సిల్వర్ మెడల్ సాధించి జాతీయస్థాయిలో తన ప్రతిభను కనబరిచింది. సిల్వర్ మెడల్ సాధించిన నాగ తనుశ్రీని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, అధ్యాపకులు కె.కిరణ్ అభినందించారు.


బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన ఆదిత్య విద్యార్థులు

బాల్ బ్యాడ్మింటన్‌లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కాకినాడ

ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచినట్లు కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ కమ్ యూనివర్శిటీ టీమ్ ఎంపిక ట్రైల్స్ పురుషుల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదికవి నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు కెఎస్‌కె.చైతన్యరెడ్డి, ఎస్ఎస్ఎస్ఎస్.శ్రీనివాస్ రెడ్డి జి.దుర్గాధనుష్, సిహెచ్.సాయిశంకర్, ఎస్‌కె.అహ్మద్ రజా, ఎన్‌జిఎన్‌ఉమా మహేశ్వర రావు బృందం నాలుగో స్థానంలో నిలిచింది. విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, అధ్యాపకులు కె.కిరణ్ అభినందించారు.

పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

జిల్లాలో రీ సర్వే పూర్తయిన గ్రామాల రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం పలుచోట్ల చేపట్టారు.

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ పట్టణ స్మార్ట్ సిటీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, ఎంఎల్‌సిలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, సిటీ ఎంఎల్‌ఎ వనమాడి వెంకటేశ్వరరావు, రూరల్ ఎంఎల్‌ఎ పంతం నానాజీ, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, ఆర్‌డిఒ ఎస్.మల్లి బాబు కాకినాడ రూరల్, కాకినాడ పట్టణం నియోజకవర్గాలలోని రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు.

సామర్లకోట పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప మండలంలోని అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ చేశారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మకాయల రంగనాగ్, ఆర్‌డిఒ కె.శ్రీరమణి, సివిల్ సప్లై డైరెక్టర్ తుమ్మల పద్మజ, తహశీల్దార్లు కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డి, సిహెచ్.వెంకటలక్ష్మి, ఎంపిడిఒ కాదా హిమామహేశ్వరి, పాలకుర్తి శ్రీనివాసాచార్యులు, ముసిరెడ్డి శ్రీరాములు, తోటకూర శ్రీనివాసు, నూనె రామారావు, అందుగుల జార్జి చక్రవర్తి, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు పాల్గొన్నారు.


కరప గ్రామసభల్లో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్టు తహశీల్దారు తుమ్మల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. నడకుదురు, పెనుగుదురు, పాతర్లగడ్డలో పుస్తకాలు పంపిణీ చేశారు. బండారు మురళి, ఆర్‌ఐ పవన్ కుమార్, డిటి దుర్గాప్రసాద్, ఆత్మ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్, మెండు గోవిందు పాల్గొన్నారు.




కాకినాడలో పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎలు


పెదపూడి పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జుత్తక సూర్యకుమారి ప్రారంభించారు. తహశీల్దార్ పివి.సీతాపతిరావు సొసైటీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, ఆర్‌ఐ చిట్టితల్లి, విఆర్‌ఒ నాగేంద్ర, సాగునీటి సంఘం డిసి చైర్మన్ సానా శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ పాసుపుస్తకాలు పంపిణీ చేశారు.


సామర్లకోటలో పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప


పిఠాపురంలో పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండలం చిక్కాలపాలెం గ్రామానికి చెందిన దొంగ జయశంకర్ యువకుడు అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిందని ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు. జయశంకర్ గత నెల డిసెంబర్ 31న ఇంటి నుంచి బయటకు వెళ్లాడని, తిరిగి రాలేదన్నారు. ఆచూకీ తెలియకపోవడతో జయశంకర్ తల్లి ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9440796662 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పేకాట, కోడి పందేలపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని ఇటికాయలపల్లి, రంప ఎర్రంపాలెం గ్రామాల్లో కోరుకొండ సి.ఐ ఎస్‌వివిఎస్.మూర్తి ఆధ్వర్యంలో గోకవరం ఎస్ఐ విఎన్‌వి.పవన్‌కుమార్, ఉమెన్ ఎస్ఐ బి.నాగమణి బృందాలు పేకాట, కోడిపందాల శిబిరాలపై దాడులు చేశారు. 10 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.13వేల నగదు, 2 కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసులు నమోదు చేశామన్నారు. మండలంలో జూదాలను నిర్వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి -దేవరపల్లి

యర్నగూడెం ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు దేవరపల్లి పోలీసులు తెలిపారు. ఉదయం పొలం పనులకు వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగి ఉండొచ్చుని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. మృతిరాలి వివరాలు తెలిస్తే దేవరపల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామ శివారు దాబా సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ముందు వెళుతున్న బైకు చక్రంలోకి సంచి ఇరుక్కుని పడుపోగా, వెనక నుంచి వస్తున్న మరో బైకు ఢీకొట్టడంతో రోడ్డు పైనుంచి వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్ అతనిపై ఎక్కడంతో ఉప్పలపాడు గ్రామానికి చెందిన బండారు దుర్గాప్రసాద్ (35) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శివ నాగబాబు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జి రామ్‌జీ స్కీమును రద్దు చేయాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన జి రామ్‌జీ స్కీమును రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు టి.ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్, దుప్పి అదృష్టదీపుడు నేరేడుమిల్లి త్రిమూర్తులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటివరకు అమలు జరిగిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధంగా రద్దుచేసి జి రామ్‌జీ పేరుతో కొత్త చట్టాన్ని తీసుకొచ్చి ఈ దేశంలోనూ రాష్ట్రంలోనూ పేద ప్రజల పొట్ట కొట్టడానికి సిద్ధమయిందన్నారు. ఈ కొత్త స్కీముని రద్దు చేసి పాత చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాల ఫలితంగా యుపిఎ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని వామపక్షాల చొరవతో తెచ్చిందని, ఈ చట్టం వచ్చిన తర్వాత దేశంలో పేదలకు, రైతులకు, గ్రామ పంచాయతీలకు ఎంతో ఉపయోగపడిందన్నారు.

ఎస్ఐగా శ్రీనివాస్‌కు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి -తాళ్లరేవు

కోరంగి పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా పని చేస్తున్న మేడిశెట్టి శ్రీనివాస్‌కు ఎస్ఐగా ఉద్యోన్నతి లభించింది. ప్రమోషన్‌పై కృష్ణా జిల్లాకు బదిలీ చేస్తూ ఎస్‌పి ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆయన శుక్రవారం తెలిపారు. కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామానికి చెందిన శ్రీనివాస్ 1989లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట గణేష్ కాలనీలో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. మధ్యాహ్నం సంభవించిన అగ్నిప్రమాదంలో పూరిపాక పూర్తిగా దగ్ధమైంది. పూరిపాక నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడగా స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చూస్తుండగానే మంటలు పెద్దవై అగ్నికీలల్లో చిక్కుకుగా మంటలను ఆర్పేందుకు ఎవరూ ముందుకు రాలేకపోయారు. విద్యుత్ కనెక్షన్‌తో ఉన్న తాటాకింటిలో కొద్ది రోజులుగా ఎవరూ ఉండటం లేదని స్థానికులు చెబుతున్నారు. పాకలో ఎవరూ లేని సమయంలో అగ్ని ప్రమాదం సంభవించడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఇఒలు

సంఘం బలోపేతానికి కృషి

ప్రజాశక్తి -తాళ్లరేవు

ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ యూనియన్ (ఎస్-16) సంఘం బలోపేతానికి కృషి చేస్తామని పలువురు అన్నారు. సంఘం రూపొందించిన 2026 క్యాలెండర్‌ను శుక్రవారం ఎంఇఒలు ఎ.మంగాయమ్మ, మోకా ఉమా ఆవిష్కరించి మొదటి క్యాలెండర్‌ను డిటి సూరిబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షుడు వాకపల్లి అప్పారావు, నీలపల్లి హైస్కూల్ హెచ్‌ఎం రాధాకృష్ణ తదితరులు మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై యూనియన్ సంఘటితంగా పోరాటం చేయడంతో పాటు సంఘం బలోపేతానికి మరింత కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కాశి శ్రీనివాసరావు, కోశాధికారి నాగాబత్తుల శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీ సెక్రటరీ గుత్తాల సుబ్రమణ్యం, స్టీరింగ్ కమిటీ సభ్యులు కాశి రవీంద్ర, ముడికి తాతారావు, మీడియా బాధ్యులు జి.రాంబాబు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ఆదిత్య యూనివర్శిటీలో గెస్ట్ లెక్చర్

ఆదిత్య యూనివర్సిటీలో గెస్ట్ లెక్చర్

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో గెస్ట్ లెక్చర్ నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నైకు చెందిన పవర్ ట్రెన్ డెవలప్మెంట్ డిప్యూటీ మేనేజర్ జి.ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు. ఈ అవగాహనా సదస్సులో ప్రేమ్ కుమార్ పాల్గొని 'ఎలక్ట్రికల్ వెహికల్స్ ఏ విధంగా డిజైన్ చేయాలి, వాటిలో వుండే కాంపోనెంట్స్, వర్కింగ్ ఆపరేషన్, ఎలక్ట్రికల్ వెహికల్స్ ఇండస్ట్రీకి వెళ్లాలంటే ఎటువంటి స్కిల్స్ అవసరం అనే అంశంపై ప్రసంగించారు. ఈ ఉపన్యాసంలో ఎలక్ట్రికల్ బస్సెస్, ట్రక్స్ కమర్షియల్ వెహికల్స్ ఫెర్మామెన్స్ మరియు ఎఫిషియన్సీ టార్గెట్స్ అనే విషయంపై విద్యార్థులకు వివరించారు. వాటి ఉపయోగాల గురించి విశ్లేషించారు. ఇఇఇ విభాగాధిపతి డాక్టర్ వి.శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, వైస్ చాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్ ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్ పాల్గొన్నారు.



డీలర్లకు సూచనలు చేస్తున్న ఎడిఎ గారిమెళ్ల శ్రీనివాస్

కార్డులు ఉంటేనే ఎరువులు ఇవ్వాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

రైతులకు వ్యవసాయ శాఖ పంపిణీ చేసిన ఎరువుల కార్డు తీసుకువచ్చిన వారికి మాత్రమే యూరియా విక్రయించాలని ఎడిఎ గారిమెళ్ల శ్రీనివాస్ ఎరువుల దుకాణ దారులను ఆదేశించారు. శుక్రవారం వ్యవసాయ శాఖ పరిశోధన కేంద్రం వద్ద సబ్ డివిజన్ పరిధిలోని డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుకాణం, సొసైటీ, రైతు సేవ కేంద్రంలోనైనా యూరియా కార్డు వినియోగించి వాటి ఆధారంగానే ఇవ్వాలన్నారు. కొంతమంది డీలర్లు యూరియా కార్డు వాడడం లేదని తద్వారా కొంత దుర్వినియోగం అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆ విధంగా చేసినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గడ్డికి ఎక్కువగా యూరియా వాడుతున్నారని, దానికి ప్రత్యామ్నాయంగా నేనో యూరియా, పశువుల పెంట సేంద్రియ ఎరువులు వినియోగించాలని సూచించారు. ఈ సమావేశంలో జగ్గంపేట వ్యవసాయాధికారి ఎస్.నరసింహం, వ్యవసాయ శాఖ సహాయకులు, డీలర్స్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన పెంచాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

సమాజంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని న్యాయవాది కెఎంఎల్.గణేష్ అన్నారు. శుక్రవారం స్థానిక 9వ సచివాలయంలో బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణంపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందజేయాలన్నారు. అనంతరం ఆయన బాల్య వివాహ నిరోధక చట్టాలు, పోక్సో చట్టంపై వివరించారు. అనంతరం బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణంపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో పిఎల్‌విబి.సూర్యనారాయణ మూర్తి, సచివాలయ కార్యదర్శి రామారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పభుత్వ ఉద్యోగులు, కుటుంబ పింఛనుదారుల లైఫ్ సర్టిఫికెట్లు ఈ నెల 1 నుంచి జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా తీసుకుంటామని డిటిఒ ఎ.గణేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛను దారులు తమ వార్షిక జీవన ప్రమాణ ధ్రువీకరణ పత్రాలను 'జీవన్ ప్రమాణ్' పోర్టల్లో కానీ, పింఛనర్ల వ్యక్తిగత సిఎఫ్ఎంఎస్ లాగిన్ ద్వారా, ఏదైనా ఖజానా కార్యాలయంలో కానీ సమర్పించవచ్చునని ఆయన తెలిపారు. ఇందుకు పింఛనర్ల ఆధార్, మొబైల్ నంబర్, పిపిఒ నంబరు, బ్యాంక్ అకౌంట్ నంబర్లు సరి చూసుకోవాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి నెలఖారులోగా లైఫ్ సర్టిఫికేట్ సమర్పించాలని, లేకుంటే ఏప్రిల్ 1న ఇచ్చే మార్చి నెల పెన్షన్ నిలిపి వేస్తారని తెలిపారు. కాకినాడ జిల్లా పరిధిలో కాకినాడ డివిజనల్ ఖజానా కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉన్నాయని, పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు, తుని, మరియు జగ్గంపేట ఉప ఖజానా కార్యాలయాలలో కూడా అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు.

మరిడమ్మ ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారి దేవస్థానం క్యాలెండర్ - 2026ను శుక్రవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, ఆయన కుమారుడు రంగనాగ్, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, వేద పండితులు ఐవి.ప్రసాద్ శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, ఎస్.రమణ, గద్దె క్రాంతివీర్, వరహాలు, శివ పాల్గొన్నారు.



శిక్షణా తరగతులలో మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యనారాయణ

ఈ-గవర్నెన్స్, పిజిఆర్ఎస్‌పై శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం డివిజన్‌లోని మండలాల్లోని డిప్యూటీ ఎంపీడీవో (పి.ఆర్), డిప్యూటీ ఎంపీడీవో (జిఎస్‌డబ్ల్యు ఎస్), ఎఒలు, సీనియర్ అసిస్టెంట్స్, జూనియర్ అసిస్టెంట్స్, పంచాయితీ కార్యదర్శులకు శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ గవర్నెన్స్ అప్లికేషన్స్, పిఎఫ్ఎంఎస్, ఈ ఆఫీస్, పిజిఆర్ఎస్‌లపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపిడిఒ కెవి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా తరగతులలో శుక్రవారం పెద్దాపురం, కిర్లంపూడి, గండేపల్లి, జగ్గంపేట, శంఖవరం మండలాల నుంచి 120 మంది ఉద్యోగులు హాజరయ్యారు. ఈ శిక్షణా తరగతుల్లో యు.భార్గవ, సురేష్, జ్యోతి, కె.వెంకటేష్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులు ఈ నెల మూడవ తేదీ వరకూ రెండు రోజుల పాటు జరుగుతాయన్నారు. ఈ శిక్షణా తరగతులను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ జివి.శేఖర్ రెడ్డి, కార్యాలయ ఎఒ ఎం.సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం

ప్రజాశక్తి - సామర్లకోట



అర్జీలు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రజల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట మండలం అచ్చంపేట ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను లిఖితపూర్వకంగా ఎంఎల్ఎ చినరాజప్పకు అందజేశారు. వాటిని పరిశీలించి పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఎంఎల్ఎ చినరాజప్ప ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి శ్రీను బాబు, తహశీల్దారు కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిడిఒ కాదా హిమామహేశ్వరి, టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, నూనె రామారావు, ముసిరెడ్డి శ్రీరాములు, బడుగు శ్రీకాంత్, సర్పంచ్ చీకట్ల వెంకటేష్, టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పనసపాడులో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎంఎల్ఎ చినరాజప్ప, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మకాయల రంగనాథ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీకట్ల వెంకటేష్, టిడిపి మండల అధ్యక్షుడు ముసిరెడ్డి శ్రీరాములు, సొసైటీ అధ్యక్షుడు అడ్డాల వెంకన్నబాబు, బచ్చల జెమిని పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహిస్తాం

ప్రజాశక్తి -పిఠాపురం



నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న జేసి

పట్టణంలో సంక్రాంతి సందర్భంగా జనవరి 9 నుంచి 11 వరకు సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహిస్తామనిజాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. శుక్రవారం స్థానిక పాడా కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు నిర్వహణపై డిఆర్ఒ వెంకటరావుతో కలిసి ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సంబరాల్లో సంక్రాంతి శోభ, తెలుగు సంస్కృతీ సాంప్రదాయాలు ఉట్టి పడేలా, జిల్లా పర్యాటకాభివృద్ధికి దోహదం చేసేలా కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం సంబరాల నిర్వహణకు పాత బస్టాండ్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ లక్ష్మణరావు, ఆర్‌డిఒ ఎస్.మల్లి బాబు, పాడా పీడీ ఎ.శ్రీనివాసరావు, సిఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ప్రిపేర్ కావాలి

ప్రజాశక్తి - సామర్లకోట



సమీక్షలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి లక్ష్మీ కిరణ్

మార్చిలో జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ప్రిపేర్ కావడం ద్వారా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉందని స్పెషల్ ఆఫీసర్ బి.లక్ష్మీ కిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పిఎంశ్రీ మున్సిపల్ హైస్కూల్లో ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. 100 రోజుల ప్రణాళిక అమలు, డైలీ టెస్టుల నిర్వహణ, మార్కుల విశ్లేషణ, రెమెడియల్ టీచింగ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ రానున్న రెండు నెలల కాలం చాలా కీలకం అని, విద్యార్థులు టివిలు, మొబైల్స్‌కు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణతో కలిసి టీచర్ల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సోషల్ టీచర్లు పి.బ్రహ్మానందం, ప్రవీణ, త్రివేణి , దుర్గ ప్రసాద్ తదితరులున్నారు.

ఈగల్ క్లబ్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట



విద్యార్థులతో మాట్లాడుతున్న సిఐ వైఆర్‌కె శ్రీనివాస్

మండలంలోని నరేంద్రపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈగల్ క్లబ్‌పై సిఐ వైఆర్‌కె శ్రీనివాస్ విద్యార్థులకు అవగాహన కలిగించారు. శుక్రవారం ఆయన ఈగల్ క్లబ్ విద్యార్థిని, విద్యార్థులతో కలిసి పాఠశాల పరిసరాల 100 గజాల దూరంలో ఉన్న షాపులను పరిశీలించారు. సిగరెట్, తదితర పొగాకు ఉత్పత్తులు, గంజాయి, పాన్ పరాగ్ వంటి మత్తు పదార్థాలు, మత్తు పానీయాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని దుకాణదారులకు హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు చేసే మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్ ధారణ ఆవశ్యకత గురించి వివరించారు. శక్తి యాప్ గురించి వివరించారు. అసాంఘిక కార్యక్రమాలపై 100,112, 9494933233 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ శేఖర్, ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్ రావు, కె.జయశ్రీ, సిహెచ్.వంశీ గంగాధర్ పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యం సక్రమంగా పాటించాలి

ప్రజాశక్తి - సామర్లకోట



పొలం బడిలో మాట్లాడుతున్న ఎడిఎ దుర్గాలక్ష్మి

వరిలో అధిక దిగుబడులు సాధించేందుకు మూడు దశల ఎరువుల యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటించాలని వ్యవసాయ శాఖ కాకినాడ డివిజన్ సహాయ సంచాలకులు కె.దుర్గాలక్ష్మి అన్నారు. వేట్లపాలెంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమంలో ఎడిఎ దుర్గా లక్ష్మి పాల్గొని మాట్లాడారు. రైతులు వరి పొలాలకు యూరియా మూడు దశలుగా వేయాలన్నారు. వ్యవసాయ అధికారి వి.మురళీధర్ మాట్లాడుతూ భూసార పరీక్ష కార్డు ప్రకారం ఎరువులు వేయాలంటే ముందు కార్డులో ఇచ్చిన పంటల వారీ సిఫార్సుని బాగా చదివి దశలవారీగా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ రూప, విఎఎలు మణికంఠ, ప్రవీణ్, రైతులు శ్రీనివాస్, పాలచర్ల వీర్రాజు, గుమ్మల వీరకుమార్, గున్నం శేషయ్య, దేశిన సత్తిబాబు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీతో పంటల మునకపై అర్జీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సర్పవరం రైల్వే స్టేషన్ సమీపంలో పైపులైన్ లీకేజి కారణంగా తమ పంట పొలాలు నీట మునిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో రైతులు అర్జీ అందజేశారు. తమ సమస్యను కార్యాలయ ఇన్‌చార్జీ మేకా లక్ష్మణ్ మూర్తికి వివరించారు. దీనిపై లక్షణ మూర్తి సానుకూలంగా స్పందించారని రైతులు తెలిపారు. కాకినాడ రూరల్ ఎంపిపిడిఒతో పాటు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సంప్రదించి సమస్య పరిష్కార దిశగా చర్యలు తీకున్నారని రైతులు వెల్లడించారు.

స్వదేశానికి చేరిన ప్రసాద్ మృతదేహం

ప్రజాశక్తి - అమలాపురం

ఇజ్రాయిల్ దేశంలో మరణించిన జిల్లా చెందిన వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం స్వదేశం చేరింది. వివరాలు ఇవి.. రావులపాలెం మండలం రావులపా లెంకు చెందిన వానపల్లి ప్రసాద్ ఇజ్రాయిల్ దేశంలో అషదద్ ప్రాంతంలోని సిమెంట్ ఫ్యాక్టరీలో ఉపాధి నిమిత్తం చేరాడు. అయితే అతను మిషన్ శుభ్రం చేస్తూ ఉండగా ప్రమాదవశాత్తు మరణించాడు. అయితే కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ప్రత్యేక చొరవతో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులు వానపల్లి సత్తి రాజు కుమారుడు వానపల్లి ప్రసాద్ మృత దేహాన్ని ఇండియా కు రప్పించారు. అయితే గతంలో ఇజ్రాయిల్ తెలంగాణ తెలుగు అసోసియేషన్ వాళ్ళ ఏ ర్పాటు చేసిన రూ.2,07,000 కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. శుక్రవారం జెసి టి.నిశాంతి చేతుల మీదుగా ఇజ్రాయిల్ ఆంధ్రప్రదేశ్ గ్రూప్ వారు సమకూర్చిన రూ. 2,85,000 మొత్తాన్ని వానపల్లి ప్రసాద్ కుటుంబా నికి అందజేశారు. కార్యక్రమం లో జెసి మాట్లాడుతూ ఇజ్రాయిల్ ఎపి గ్రూపు సమకూర్చిన ఆర్థిక సహాయం పట్ల గ్రూప్ సభ్యులకు మ తుని కుటుంబం తరపున ధన్యవాదాలు తెలిపారు.

యానాం వార్తలు

ఘనంగా దినేష్ పుట్టిన రోజు

ప్రజాశక్తి - యానాం



మొక్కల పెంపకాల పరిశీలన

యానాం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్దాని దినేష్ పుట్టినరోజు వేడుకలు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పుదుచ్చేరి సిఎల్‌పి నాయకుడు, ఎంఎల్ఎ వైద్యనాథన్, మాజీ ఎంఎల్ఎ అనంతరామన్, కార్తికేయన్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కాటంశెట్టి రామూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ అభయ బ్లెడ్ సెంటర్ ద్వారా రక్తదానం శిబిరం నిర్వహించారు. కార్యకర్తలకు జీవిత బీమా చేయించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అభిమానుల మధ్య భారీ కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మెల్లం చిన్నబ్బి ఆదిమూర్తి, చెక్కల అరుణ్ కుమార్, పైడికొండల రాజబాబు, పెరుమాడి అశోక్, మచ్చా శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

పెరటి మొక్కల పెంపకం పరిశీలన

ప్రజాశక్తి - యానాం

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ 24వ ఫల పుష్ప ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ మేరకు పెరటి తోటల పెంపకాలు, ఉద్యాన వనాల పెంపకాలను సంబంధిత అధికారులు ప్రదర్శనకు దరఖాస్తు చేసుకున్న పోటీదారుల ఇంటి వద్ద శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో పని చేస్తున్న ఎంటిఎస్ ఉద్యోగి సమ్మె వీర వెంకట సత్యనారాయణ మేడ మీద ఏర్పాటు చేసిన వివిధ రకాల పండ్ల, పూలు, కూరగాయల మొక్కలను పరిశీలించారు. వాటిని నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ అశోక్‌ను కలిసిన జిప్‌మెర్ బృందం

ప్రజాశక్తి - యానాం

యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను స్థానిక జిప్‌మెర్ ఆసుపత్రి కన్సల్టింగ్ యూనిట్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆనంద్ రాజు ఇతర సిబ్బంది కలిశారు. శుక్రవారం స్థానిక గోపాల్ నగర్‌లోని ఎంఎల్ఎ నివాసంలో కలిసి ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంఎల్ఎ యూనిట్ ఇన్‌ఛార్జి ఆనంద్ రాజుతో పలు అంశాలపై చర్చించారు. యానాం ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవిశంకర్ ఎంఎల్ఎ కలిసి శుభాకాంక్షలు తెలిపారు



సభలో మాట్లాడుతున్న సిఎల్‌పి లీడర్ వైద్యనాథన్

కాంగ్రెస్ తోనే యానాం అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - యానాం

కాంగ్రెస్‌తోనే యానాం అభివృద్ధి సాధ్యమని పుదుచ్చేరి కాంగ్రెస్ సిఎల్‌పి లీడరు వైద్యనాథన్ అన్నారు. శుక్రవారం స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణం ఎదురుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంలో ప్రజలు మోసపోయారన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పుదుచ్చేరిలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయం సాధిస్తుందని, కాంగ్రెస్ పార్టీ హయాంలోనే యానాం అభివృద్ధి చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా ఉండాలని పిలుపునిచ్చారు.



నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న స్థానికులు

చక్రవర్తి నగర్‌లో నూతన సంవత్సర సందడి

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని నీలాద్రిరావుపేట చక్రవర్తి నగర్ వాసులు నూతన సంవత్సర వేడుకలను గురువారం రాత్రి సందడిగా నిర్వహించారు. ఆట, పాటలతో ఉల్లాసంగా నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. పిల్లలకు, కాలనీలోని గృహిణులకు వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. ఆ పోటీల్లో గెలుపొందినవారికి ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.పూర్ణిమ బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారికి కన్సోలేషన్ ప్రైజులు అందించారు. అనంతరం సైనికునికి సన్మానం చేశారు.

పాస్‌పోర్ట్ పోయినది

తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల గ్రామానికి చెందిన కనికినీడి అమ్మన రాజా పాస్‌పోర్ట్ నెంబర్ K 3764639ను జిరాక్స్ నిమిత్తం పెరవలి సెంటర్కు వెళ్ళుతుండగా మార్గమధ్యలో పడిపోయింది దొరికిన వారు క్రింది అడ్రస్కు అందజేయగలరు

కనికినీడి అమ్మన రాజా
తండ్రి. కనికినీడి శ్రీనువాసు, ఇంటి నెంబర్. 3-25
ఆంజనేయ స్వామి టెంపుల్ స్ట్రీట్ , ముక్కామల గ్రామం
పెరవలి మండలం , తూర్పుగోదావరి జిల్లా.534330
ఫోన్ నెంబర్. 9121511503